మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయాలి



గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని, పర్యావరణాన్ని కాపాడాలనే సందేశంతో రూపొందించిన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ పరంజ్యోతి, కె. వీరయ్య తదితరులు

నల్లకుంట, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మండపాల్లో మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయాలని హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ పరంజ్యోతి పిలుపునిచ్చారు. హైదరాబాద్ జిందాబాద్, సిటిజన్స్ ఫోరం సంయుక్తాధ్వర్యంలో బుధవారం నల్లకుంటలో మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయాలని, పర్యావరణాన్ని కాపాడాలనే సందేశంతో రూపొందించిన ప్రచార పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎనిమిదేళ్ల నుంచి హెచ్‌ఎండీఏ సహకారంతో మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా 40 కాలనీలు, బస్తీల్లో మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిందాబాద్ సంస్థ ప్రధాన కార్యదర్శి కె. వీరయ్య, నాయకులు ఎం. శ్రీనివాసరావు, మోహన్‌నాయుడు, పి. శ్రీనివాసరావు, సంగీత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలి



గోల్నాక డివిజన్ గణేశ్ మండపాల నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ గంధమల్ల ఆనంద్‌గౌడ్

గోల్నాక, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని మండపాల నిర్వాహకులకు భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ గంధమల్ల ఆనంద్‌గౌడ్ సూచించారు. బుధవారం గోల్నాక డివిజన్‌లో మండపాల నిర్వాహకులతో గోవింద్‌నగర్‌లోని ఎస్‌కే ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మండపాల వద్ద నిర్వహించే కార్యక్రమాలు భక్తి, జాతీయ భావం పెంపొందించే విధంగా ఉండాలన్నారు. సమావేశంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అంబర్‌పేట నియోజకవర్గం కో-కన్వీనర్ సూదగాని శ్రీధర్ గౌడ్, గోల్నాక డివిజన్ కన్వీనర్ వరికుప్పల హరి, బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్, ఉత్సవ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలపై అవగాహన

బర్కత్‌పుర, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విభూతి బ్రదర్స్ వి. ప్రశాంత్ కళాజాత బృందం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన కార్యక్రమం బుధవారం కాచిగూడలో ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించారు. ప్రశాంత్ మాట్లాడుతూ.. మట్టి విగ్రహం, మహా విగ్రహం అని, మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి చెరువులను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



కాచిగూడ బస్టాండ్‌లో కళా ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

మండపాలకు ఉచితంగా రెండు కిలోల లడ్డూ పంపిణీ

అంబర్‌పేట, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాల సందర్భంగా అంబర్‌పేట నియోజకవర్గంలో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న మండపాలకు భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి తరఫున రెండు కిలోల లడ్డూ ఉచితంగా అందజేస్తామని ఉత్సవ సమితి నియోజకవర్గం కన్వీనర్ జి. ఆనంద్‌గౌడ్ తెలిపారు. బుధవారం అంబర్‌పేటలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. గణేశ్ పూజల్లో పాల్గొనే మహిళలకు తులసి మొక్కలు, నవరాత్రి వేడుకల్లో మండపాల ఎదుట ముగ్గులు వేసిన వాటిలో ఉత్తమమైన వాటికి బహుమతులు అందజేస్తామన్నారు. ఈనెల 17న విగ్రహాలను నిమజ్జనానికి తరలించే వాహనాలకు జాతీయ జెండా కట్టాలని మండపాల నిర్వాహకులకు ఆయన సూచించారు.



ముదిగొండ శివప్రసాద్‌కు సర్వేపల్లి రాధాకృష్ణన్ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న మధుసూదనాచారి

జీవిత మార్గం చూపేవారు ఉపాధ్యాయులు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు అంటే పాఠ్యపుస్తకాలలోని అంశాలు చెప్పేవారే కాదని, జీవిత మార్గం చూపేవారని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో బుధవారం మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఎందరో మహానుభావులు కార్యక్రమం పరంపరంలో భాగంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి ముదిగొండ శివప్రసాద్‌కు సర్వేపల్లి రాధాకృష్ణన్ పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాధాకృష్ణన్ అధ్యాపకవృత్తిలో ఉండి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన మహోన్నతులు అని అన్నారు. ఆయన జయంతి రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం సముచితమన్నారు. త్యారాయగానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి, యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, కవి డా. అక్కిరాజు సుందరరామకృష్ణ, ఉపాధ్యాయురాలు పేరి అన్నపూర్ణ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కాకి మాధవరావు, జస్టిస్ బి.చంద్రకుమార్ తదితరులు

పేదల సమస్యలపై మార్క్స్, అంబేడ్కర్ భావాలు ఒక్కటే

రాంనగర్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): పేదల సమస్యలపై మార్క్స్, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ భావాలు ఒక్కటేనని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు అన్నారు. యువత మార్క్స్, అంబేడ్కర్‌లను స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేయాలని సూచించారు. బుధవారం తెలంగాణ ప్రజా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ రచయిత జి.రాములు రచించిన లాల్‌నీల్ స్ఫూర్తి ప్రదాతలు పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రచయిత పుస్తకంలో అనేకమంది ప్రముఖులకు సంబంధించిన స్ఫూర్తిదాయకమైన విషయాలను ప్రస్తావించడం అభినందనీయమన్నారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, జస్టిస్ బి.చంద్రకుమార్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక సంస్థ కేంద్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకుడు ఎస్.వీరయ్య, ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, ప్రొఫెసర్ ననుమాస స్వామి, బీఎల్‌ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ హుండీ ఆదాయం రూ. 1.59 లక్షలు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. నలభై రోజుల ఆదాయం రూ. 1,59,131 వచ్చిందని ఈవో మాచర్ల దేవనాథం తెలిపారు. హుండీ లెక్కింపులో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, మాజీ ధర్మకర్త జానకి సుధాకర్, అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, వెంకటాద్రి, ప్రశాంత్, శివ, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మూకశ్మీర్ సెంట్రల్ షాల్టెంగ్ నియోజకవర్గం

ఏఐఎంసీ ఇన్‌చార్జిగా ఎస్తేర్ రాణి



చిక్కడపల్లి, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్ సెంట్రల్ షాల్టెంగ్ నియోజకవర్గం ఆలిండియా మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జిగా రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డా. ఎస్తేర్‌రాణి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆలిండియా మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలాంబా ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్తేర్‌రాణి మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌లో త్వరలో జరగనున్న ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేస్తానన్నారు.

మేకల ముత్తన్నకు నివాళి



ముత్తన్నకు నివాళులర్పిస్తున్న కె. రాములు, డి. సుదర్శన్ బాబు తదితరులు

కవాడిగూడ, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ జాతీయ గౌరవాధ్యక్షుడు స్వర్గీయ మేకల ముత్తన్న ఆశయ సాధనకు దళితులు కృషి చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కె. రాములు పిలుపునిచ్చారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డి. సుదర్శన్ బాబు అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాములు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ కోసం ముత్తన్న చేసిన కృషి మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో షెడ్యూల్డుకులాల హక్కుల పరిరక్షణ సొసైటీ జాతీయ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్. నర్సింహారావు, ఏపీ అధ్యక్షుడు చెన్నకేశవరావు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రారం శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి : ఐఎఫ్‌టీయూ

- 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు

రాంనగర్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, అసంఘటిత కార్మికుల డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చాలని ఐఎఫ్‌టీయూ ఉభయ రాష్ట్ర కమిటీల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎం. శ్రీనివాస్, ఆర్. జనార్దన్, ఉపాధ్యక్షులు జి. అనురాధ, అరుణ, పి.శివబాబు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 8 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాలలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 8న గోదావరిఖని, 13న నిజామాబాద్, 19న ఖమ్మం, 20న గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 20న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.



మెట్టు శ్యామ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ డా. లక్ష్మణ్

మెట్టు శ్యామ్ మృతి బీజేపీకి తీరనిలోటు

ముషీరాబాద్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు మెట్టు శ్యామ్ మృతి బీజేపీకి తీరని లోటని ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. బుధవారం నాయకులతో కలిసి ముషీరాబాద్ డివిజన్ లోయబస్తీలో శ్యామ్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. శ్యామ్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం, ఓబీసీ మోర్చా మహాకాళి జిల్లా నాయకుడు వాసు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ ఆస్పత్రికి రోగుల తాకిడి



ఫీవర్ ఆస్పత్రిలో ఓపీ వద్ద రోగుల రద్దీ

బర్కత్‌పుర, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వచ్చిన మార్పులు, వర్షాలతో జ్వరాలతో నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రి ఓపీకి రోగుల తాకిడి పెరుగుతోంది. జ్వరాల బారిన పడుతున్న వారిలో అధిక శాతం 12 ఏళ్లలోపు చిన్నారులు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. రోడ్లపైన చెత్తా చెదారం, మురికి నీరు నిలుస్తుండడం, దోమలు వృద్ధి చెందడంతో డెంగీ కేసులు కూడా పెరుగుతున్నాయి. డెంగీ బారిన పడిన వారిలో కొంతమంది మాత్రమే ఫీవర్ ఆస్పత్రికి వస్తుండగా.. చాలా మంది ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. వైరల్ ఫీవర్, డెంగీ, చికున్‌గున్యా, డిఫ్తీరియా, మలేరియా, టైఫాయిడ్, వాంతులు, విరేచనాలు, దగ్గు, జలుబుతో బాధపడుతున్న రోగులు ఫీవర్ ఆస్పత్రికి వస్తున్నారు. వీరిలో వైరల్ ఫీవర్ బాధితులు ఎక్కువ మంది ఉన్నారు. ఈ నెలలో నాలుగు రోజుల్లో 2098 ఓపీ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం 62 మంది ఇన్‌పేషెంట్‌లుగా చికిత్స పొందుతున్నారు. ప్రతిరోజూ 3 నుంచి 4 డెంగీ కేసులు నమోదవుతున్నాయి.

వైద్యుల కొరత

ఆస్పత్రిలో వైద్యుల కొరతతో రోగులు అవస్థ పడుతున్నారు. 16 మంది వైద్యులు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు. ప్రస్తుతం నలుగురు వైద్యులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. 8 మంది పీజీ విద్యార్థులు గాంధీ ఆస్పత్రి నుంచి వచ్చి సేవలు అందిస్తున్నట్లు తెలిసింది. ఆస్పత్రిలో నర్సింగ్ స్టాఫ్ 49 మంది ఉండగా, వీరిలో 28 మంది బదిలీ అయ్యారు. సూపరింటెండెంట్ బదిలీ కాగా.. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఆర్‌ఎంవో డాక్టర్ జయలక్ష్మి వ్యవహరిస్తున్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో నష్టపోయిన బాధిత కుటుంబాలు, రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలో జరిగిన ఫ్రంట్ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదలతో నష్టపోయిన ఒక్కో కుటుంబానికి తక్షణ సహాయంగా రూ. 25 వేలు, ఒక్కో రైతుకు ఎకరానికి రూ. 15 వేలు చెల్లించాలన్నారు. రాష్ట్రాన్ని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే రూ. 2 వేల కోట్ల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫ్రంట్ నాయకులు సూర్యనారాయణ, రామనర్సయ్య, మామిడాల రాజు, సేనాపతి, ఆశీర్వాదం, కె.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీజీఆర్ నారగోని

రెండు రాష్ట్రాలకు రూ. 7 వేల కోట్లు విడుదల చేయాలి

కవాడిగూడ: రెండు రాష్ట్రాల్లో వరద బాధితులకు తక్షణ సహాయం అందించాలని దళిత బహుజనపార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం రెండు రాష్ట్రాలకు రూ. 7 వేల కోట్లు విడుదల చేయాలన్నారు. మృతుల కుటుంబాలకు రూ. 50 లక్షలు, గాయపడిన వారికి రూ. 5 లక్షలు, సర్వం కోల్పోయిన వారికి రూ. 10 లక్షలు, వ్యవసాయ కూలీలకు రూ. 2 లక్షలు, పంటల నష్టానికి రూ. 2 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి ఉచితంగా ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. సమావేశంలో డీబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిలివేరి వసంతరావు, ప్రధాన కార్యదర్శి బీరం సతీష్‌కుమార్, రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ గోలి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

బీఆర్‌ఎస్ నేతల అసత్య ప్రచారం

రాంనగర్: భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే బీఆర్‌ఎస్ నేతలు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు అసత్య ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జీఎన్. కేశవ్ ఆరోపించారు. బుధవారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు ప్రజల సమస్యలపై శ్రద్ధ ఉంటే వరద ప్రాంతాలను సందర్శించి బాధితులకు సహకారం అందించాలని డిమాండ్ చేశారు. వరద బాధితులను ఆదుకోవడానికి ప్రతిఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఆయన కోరారు. రాష్ట్రాన్ని కేంద్రం ఆదుకోవాలన్నారు.

కోదండరాంకు వడ్డెర సంఘం సన్మానం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా నియమితులైన తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొ. కోదండరాంను వడ్డెర్ల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ నేతలు త్యాగరాయగానసభలో బుధవారం సన్మానించారు. ట్రస్ట్ వైస్‌చైర్మన్, వడ్డెరసంఘం తెలంగాణ(గన్నుదెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి అంతయ్య, డైరెక్టర్ డా. ఓర్సు కృష్ణయ్య, డి. బాలరాజ్, అనంతరావు, మోహన్‌కుమార్, నాగయ్య, శంకర్, లీడర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ కోదండరాంను సన్మానించిన వడ్డెర్ల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ నేతలు

రికార్డు స్థాయిలో బీజేపీ సభ్యత్వాన్ని నమోదు చేయించాలి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలో బీజేపీ సభ్యత్వాన్ని రికార్డు స్థాయిలో నమోదు చేయించాలని మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావు పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. బీజేపీ బలమైన శక్తిగా ఎదగడానికి సభ్యత్వ నమోదు దోహదపడుతుందన్నారు. యువతీ యువకులు, మహిళలు, ఉన్నత విద్యావంతులు, మేధావులను పార్టీ సభ్యులుగా చేర్పించాలని సూచించారు. సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆనంద్‌గౌడ్, నాయకులు కృష్ణాగౌడ్, అనంతలక్ష్మి, రాహుల్‌చంద్ర, సి. వినోద్‌యాదవ్, నానాజీ పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళా ట్రాన్స్‌జెండర్ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ

కోలకతా కమిషనర్‌ను తొలగించాలి

కవాడిగూడ, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హంతకులను రక్షిస్తున్న కమిషనర్‌ను తొలగించాలని మహిళా ట్రాన్స్‌జెండర్ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం రాత్రి లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఝాన్సీ, సంధ్య, అనసూయ, సజయ, జ్యోతి, కృష్ణకుమారి, శ్రీదేవి, అరుణ, వరలక్ష్మి, దీప తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా పదిమంది ఎంపిక

ముషీరాబాద్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ విద్యా మండలి పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా పదిమందిని బుధవారం ప్రభుత్వం ఎంపిక చేసింది. వారి వివరాలను డిప్యూటీ ఈవో చిరంజీవి బుధవారం వెల్లడించారు. కె. శశికళ, సుజాత, డి. శశికళ(సీతాఫల్ మండి ప్రభుత్వ పాఠశాల), ఎస్. సుజాత (నల్లకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల), ఫరాహత్‌బాను (ముషీరాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు), కె. శ్రీనివాస్ (ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు), హేమమాలిని(జామై ఉస్మానియా ప్రభుత్వ ఉన్నత పాఠశాల), శివరంజని, కె. పుష్పలత (అడిక్‌మెట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల), తుమ్మ ప్రమీల (రాంనగర్ సెయింట్ పాయిస్ ఎయిడెడ్ స్కూల్) ఎంపికయ్యారని వివరించారు. వీరందరూ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందుకుంటారని చిరంజీవి చెప్పారు.

విజయభాస్కర్‌కు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



గోల్నాక, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 137వ జయంతి సందర్భంగా యువతేజ ట్రస్ట్, కలాం విజన్ ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో ఈనె 14న తిరుపతిలో జరిగే కార్యక్రమంలో డాక్టర్ ఎస్. విజయభాస్కర్‌కు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రదానం చేయనున్నట్లు ఆ సంస్థల కన్వీనర్ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఎస్.విజయభాస్కర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల శాలిబండలో తెలుగు పండిట్‌గా విధులు నిర్వహిస్తూ సాహితీ, సాంస్కృతిక, సామాజిక, విద్యా రంగాలలో చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఆయనను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.



డ్రైనేజీ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

శాంతినగర్‌లో రూ. 7 లక్షల వ్యయంతో డ్రైనేజీ పైపులైన్

గోల్నాక, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): శాంతినగర్‌లో రూ. 7లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలో బస్తీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి గోల్నాక డివిజన్ మేనేజర్ రోహిత్‌కుమార్, నాయకులు ఎర్ర భీష్మదేవ్, ఎం.రాజేష్, మల్లేష్‌గౌడ్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

14 మంది అర్చకులకు ఆర్థిక సహాయం

గోల్నాక, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో వివిధ దేవాలయాల్లో పనిచేస్తున్న పురోహితులు 14 మందికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బుధవారం ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల నుంచి అర్చకులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు.

మ్యాన్‌హోల్ సమస్యను పరిష్కరించాలి

నల్లకుంట, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): మ్యాన్‌హోల్స్ పొంగకుండా జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ యాకర అమృత సూచించారు. నల్లకుంట డివిజన్ టీఆర్‌టీ కాలనీలో మ్యాన్‌హోల్ పొంగి డ్రైనేజీ నీరు రోడ్డుపై పారుతుండడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం ఆ ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.



పొంగుతున్న మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్

గాంధీనగర్ డివిజన్ అభివృద్ధికి సహకరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ అభివృద్ధికి సహకరించాలని కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ కోరారు. బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధికి సహకరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారన్నారు.

పటేల్‌నగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర

అంబర్‌పేట, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): పటేల్‌నగర్, ప్రేమ్‌నగర్‌లో అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ బుధవారం పర్యటించారు. బస్తీవాసులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



బస్తీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్